రక్షణ గోడలు నిర్మించండి సారూ..



పొట్టేళ్ల వాగు వంతెన

పొదలకూరు: పొదలకూరు – మనుబోలు రహదారిలో నిమ్మ మార్కెట్ యార్డుకు సమీపంలోని పొట్టేళ్లవాగు వంతెనంటే వాహనచోదకులు హడలిపోతున్నారు. ఇటీవల కాలంలో తరచూ వంతెనపై ప్రమాదాలు జరుగుతుస్తున్నాయి. ఈ మార్గంలో మనుబోలు మండలం వీరంపల్లి, గొట్లపాళెం, మండలంలోని బిరదవోలు ఆటోలు అధిక సంఖ్యలో తిరుగుతుంటాయి. సరిగ్గా పొట్టేళ్ల వాగు వంతెన వచ్చే సమయానికి అవి ఢీకొంటున్నాయి. గతంలో రెండు ఆటోలు వెళుతుండగా ఇసుక లారీ వేగంగా వెళ్లి ఢీకొంది. ఆటోలు వాగులో పడి అందులోని వారు ఎగిరిపడ్డారు. వంతెనపై చిన్నచిన్న యాక్సిడెంట్లు సంభవిస్తూనే ఉన్నాయి. రక్షణ గోడలను నిర్మిస్తే కొంతవరకు ప్రమాదాలను నివారించవచ్చు. అలాగే మండలంలోని ఇనుకుర్తి, అయ్యగారిపాళెం, నందివాయ గ్రామీణ రోడ్డు మలుపుల వద్ద రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ఆటోలు, ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

అధ్వానంగా కందలపాడు రోడ్డు

వెంకటాచలం: మండలంలోని కందలపాడు గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్ రోడ్డుపై తారును తవ్వించి వదిలేశారు. కంకర తేలి రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది. కనుపూరు, వెంకటాచలం, కందలపాడు, పులతీగలపాడు తదితర గ్రామాల ప్రజలు ఈ రోడ్డుపై నిత్యం ప్రయాణిస్తుంటారు. రాత్రి వేళల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదకరంగా మలుపు



ఇనుకుర్తి వద్ద మలుపు

పొదలకూరు: రాపూరు – పొదలకూరు మార్గంలో ఇనుకుర్తి వద్ద ఉన్న మలుపు ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ హెచ్చరిక బోర్డు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్టు గ్రామస్తులు వెల్లడిస్తున్నారు. ఈ మార్గంలో వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. కంకర లోడుతో టిప్పర్లు, ఆర్టీసీ బస్సులు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆర్ అండ్‌బీ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

క్లుప్తంగా

8 నుంచి ఆధార్ క్యాంపులు

నెల్లూరురూరల్: జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా ఆధార్ నమోదు, అప్‌డేట్ కోసం అక్టోబర్ 8 నుంచి 14వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పోస్టల్ శాఖ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 8, 9 తేదీల్లో దర్గామిట్టలోని కస్తూరిదేవి బాలికోన్నత పాఠశాల, 10, 11 తేదీల్లో దర్గామిట్ట జెడ్పీ హైస్కూల్‌లో, 13, 14 తేదీల్లో మూలాపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆధార్ క్యాంపులు జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'చలో విజయవాడ' జయప్రదానికి పిలుపు



ర్యాలీ చేస్తున్న ఫ్యాప్టో నేతలు

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఈనెల 7న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్, కార్యవర్గ సభ్యుడు చిట్టేడి రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో స్థానిక ఏబీఎస్ కాంపౌండ్ నుంచి వీఆర్సీ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 12వ పీఆర్సీని విడుదల చేయడంతో పాటు బకాయిలు చెల్లించాలన్నారు. మెమో 57ను అమలు చేయాలన్నారు. చలో విజయవాడ కార్యక్రమానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు జావీద్, మురళీకృష్ణ, ప్రసాద్, మాధవ్, శేషు, నరసింహం, హజరత్, పిచ్చిబాబు పాల్గొన్నారు.

జిల్లా యోగా జట్ల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): విశాఖపట్నంలో జరిగే 39వ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు పాల్గొనే నెల్లూరు జిల్లా యోగా జట్ల ఎంపికలను ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ కార్యదర్శి ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో కలివేలపాళెం రెయిన్‌బో స్కూల్‌లో జరిగిన పోటీల్లో వివిధ విభాగాల్లో 160 మంది బాలబాలికలు, స్త్రీలు, పురుషులు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి రెయిన్‌బో స్కూల్ ప్రిన్సిపల్ అరుణ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో న్యాయనిర్ణేతలు గూడూరు రాజ, కోవూరు శ్రీను, కోఆర్డినేటర్ పద్మావతి, రవీంద్ర, రాజేంద్ర, మునిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా చెకుముకి టాలెంట్ టెస్ట్

నెల్లూరు(అర్బన్): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను ఈ సంవత్సరం నగరంలోని 150 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామని ఆ వేదిక నగరాధ్యక్షుడు మోహన్‌రెడ్డి అన్నారు. చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్, ఇతర కార్యక్రమాలపై నగర కమిటీ సమావేశం హరనాథపురంలోని జేవీవీ కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ చెకుముకి టెస్ట్‌ను శాస్త్రీయ కోణంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు నిర్వహిస్తామన్నారు. జేవీవీ కార్యకర్తలు జయప్రదం చేయాలన్నారు. అలాగే ఈనెల 11న అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా 9, 10వ తేదీల్లో అన్ని పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని తీర్మానించారు. బాలికలకు సాంస్కృతిక పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర నాయకులు డాక్టర్ కాలేషాబాషా, డాక్టర్ శ్రీనునాయక్, జిల్లా కార్యదర్శి విజయకుమార్, మాదాల రాము, సమత విభాగం కన్వీనర్ విజయమ్మ, నగర కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పప్పుధాన్యాల సాగు.. తగ్గుముఖం

- 5 వేల ఎకరాల నుంచి 500 ఎకరాలకు
- నేడు అనుకూలంగా వాతావరణం
- ఈనెలాఖరు వరకు అవకాశం



సాగుకు సిద్ధం చేసుకున్న మెట్టభూమి



గతేడాది చేపట్టిన మినుము సాగు (ఫైల్)

పొదలకూరు: స్వల్పంగా వర్షాలు కురవడం, ఎండల వేడిమి తగ్గుముఖం పట్టడం మెట్టపంటల సాగుకు అనుకూలిస్తోంది. కాగా ఇప్పటి వరకు మెట్ట రైతులు మినుము, పెసర పంటల సాగుకు సమాయత్తం కాలేదు. ఈ ప్రాంతంలో అసలు సాగు ఉంటుందో లేదో అనేది కూడా ప్రశ్నార్థకంగా ఉంది. కొందరు మాత్రం దుక్కి దున్నకం పూర్తి చేసి వాన కోసం ఎదురు చూస్తున్నారు. నిమ్మతోటల్లో సైతం అంతర పంటలుగా మినుము, పెసరలతోపాటు కందిని కూడా సాగు చేయాల్సిందిగా అధికారులు తెలిపారు. మండలంలో రెండు రోజుల్లో మోస్తరు వర్షం కురిసింది.

మండిన ఎండలు

సెప్టెంబర్ నెలలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యాయి. స్వల్పంగానైనా వర్షాలు కురిసి ఉంటే మెట్ట రైతులు మినుము, పెసర, పచ్చిశనగ, కంది పంటల సాగుకు సిద్ధమయ్యేవారు. అయితే వర్షాలు పడటం అటుంచి ఎండల తీవ్రత వల్ల మెట్టపంటల సాగు జోలికెళ్లలేదు. అక్టోబర్ చివరి వరకు పంటల సాగుకు అవకాశం ఉన్నందున స్వల్పంగానైనా పండించేందుకు పలువురు రైతులు పూనుకుంటున్నారు. ఈ ప్రాంతంలో గతంలో 5 వేల ఎకరాల్లో మినుము, పెసర సాగు చేశారు. నేడు 500 ఎకరాల్లో మాత్రమే సాగు చేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. చాలామంది అన్నదాతలు బయటి ప్రాంతాలకు వెళ్లి మినుము సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతానికి చెందిన కొందరు చిత్తూరు, తిరుపతి జిల్లాలకు వెళ్లి మెట్టపంటలు సాగు చేస్తున్నారు.

ఇది మేలు

మినుములో ఎల్లో మొజాయిక్ (తెల్లదోమ, పేను బంక తెగులు)ను తట్టుకునే వీబీఎన్ – 8 రకం విత్తనాలను గతేడాది వ్యవసాయాధికారులు అందజేశారు. మెట్టపొలాలున్న ప్రతి రైతుకు 4 కిలోల బ్యాగ్‌ను ఉచితంగా అందజేస్తామని అప్పట్లో తెలిపారు. రైతులు కొత్తగా తెగుళ్లను ఎదుర్కొనేందుకు వచ్చిన ఈ రకం మినుము విత్తనాలను సాగు చేసి చూడాలంటున్నారు. నిమ్మతోటలు ఎక్కువ ఉన్న వారు అంతర పంటగా సాగు చేశారు. తెగుళ్లను తట్టుకుని నిలబడినట్టు అప్పట్లో తెలిపారు. వీబీఎన్ – 8 మినుము రకాన్ని ఈ ఏడాది కూడా రైతులు సాగు చేస్తారా? లేక అపరాల సాగుకు స్వస్తి చెబుతారా అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు.

నిమ్మతోటలకు మేలు



ప్రస్తుతం కురుస్తున్న వర్షం నిమ్మతోటలకు మేలు చేసేలా ఉంది. మెట్టపంటల సాగుకు ఉపయోగమైన వర్షం అయినప్పటికీ వరుస నష్టాల వల్ల రైతులు ఆసక్తి చూపడం లేదు. అయితే స్వల్పంగానైనా మినుము, పెసర పంటల సాగు చేయాలనే యోచనలో కొందరున్నారు.

– వి.దయాకర్‌రెడ్డి, రైతు

సాగును బట్టి విత్తనాలు



రైతులు మినుము, పెసర సాగు చేస్తామని సమాచారం ఇస్తే సబ్సిడీ విత్తనాలకు ఇండెంట్ పెట్టడం జరుగుతుంది. ఇప్పటి వరకు మెట్టపంటల సాగుకు రైతులు సమాయత్తమైనట్టు సమాచారం లేదు. చిత్తకార్తె వరకు మినుము, పెసర విత్తేందుకు అదును ఉంటుంది.

– వి.ప్రతాప్, ఏఓ, పొదలకూరు

బాణసంచా గోదాముపై దాడులు



విడవలూరు : బాణసంచా గోదాముపై పోలీసులు దాడులు చేసిన ఘటన మండలంలోని వెంకటనారాయణపురం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని వెంకటనారాయణపురం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అనధికారంగా లైసెన్స్ లేకుండా బాణసంచాను తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై నరేష్ తన సిబ్బందితో దాడులు చేశారు. పోలీసుల రాకతో వారు అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో అక్కడున్న ఎనిమిది బాక్సుల బాణసంచాను పోలీసులు స్వాధీనం చేసుకుని చేసుకొని కేసు నమోదు చేశారు.

వామ్మో.. ఎండ

పొదలకూరు: సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో ఎండల వేడిమి ఉంటుంది. అయితే అక్టోబర్‌లో వర్షాలకు బదులు ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయి. ప్రజలు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. ఉత్తరాంధ్రలో తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసి రైతులు నష్టపోతుంటే ఇక్కడ చినుక పడటం లేదు. అడపాదడపా వాన కురిసినా మెట్టపంటల సేద్యానికి మాత్రమే ఉపయోగపడుతున్నట్టు రైతులు వెల్లడిస్తున్నారు. ఈనెలలో వర్షాలు ముంచిపోయాల్సి ఉండగా ఎండలు ఉగ్ర రూపం దాల్చాయి.

కార్యకర్తలకు అండగా ఉంటా

- కాకాణి గోవర్ధన్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న కాకాణి

మనుబోలు: తనను రెండు సార్లు ఎమ్మెల్యే గెలిపించి రాష్ట్ర మంత్రి స్థాయికి చేరుకునేందుకు దోహదపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని మాజీ మంత్రి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మండలంలోని గొట్లపాళెం గ్రామంలో మృతిచెందిన ఎస్సీ నాయకుడు సర్వేపల్లి రామయ్య పార్థివ దేహానికి ఆదివారం ఆయన నివాళులర్పించారు. వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రారంభం నాటి నుంచి జగనన్న వెంట నడుస్తూ తనకు తోడుగా నిలిచిన రామయ్య అకాల మరణం బాధాకరమన్నారు. అధికారం కోల్పోగానే పార్టీలు ఫిరాయించే అవకాశవాదులున్న నేటి రోజుల్లో ప్రలోభాలకు లొంగిపోకుండా నీతిగా ఉన్న రామయ్య లాంటి వారు తనకు ఆదర్శమన్నారు. పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తూ ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, పార్థేశ్వరరెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యోగా పోటీల్లో ప్రతిభ



కోవూరు: విజయవాడలో జరిగిన జాతీయ యోగా పోటీల్లో కోవూరులోని చైతన్య యోగా కేంద్రం శిక్షకురాలు పి.ప్రసన్న ప్రథమ స్థానం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ క్రమంలో ఆమెకు ఆదివారం కోవూరులో అభినందన సభ నిర్వహించారు. యోగా గురువు జనార్దన్, పతాంజలి యోగా జిల్లా అధ్యక్షుడు రమణయ్య, యోగా మాస్టర్ శ్రీను పాల్గొని, ఆమెను సత్కరించారు.

ఇస్కపాళెంలో కొవ్వొత్తుల ర్యాలీ



వెంకటాచలం: చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం పెద్దదేవల్లపాళెం గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి అసాంఘిక శక్తులు మంటలు అంటించడాన్ని నిరసిస్తూ మండలంలోని ఇస్కపాళెంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అడపాల ఏడుకొండలు, దళిత నాయకులు తలారి రాజ్‌కుమార్, జోగి పురుషోత్తం, తుమ్మతాటి రవిబాబు, బాలస్వామి, భాస్కరరావు, జోగి నాగరాజు, జంగం శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న పర్యటన



విడవలూరు: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మండలంలోని వరిణి పంచాయతీ వీరారెడ్డిపాళెంలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బండ్ల వెంకయ్య–స్రవంతి దంపతుల నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. పూలమొక్కతో శుభాకాంక్షలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మనుబోలు: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. శనివారం రాత్రి మనుబోలుకు చెందిన చిట్టేటి ప్రవల్లిక దసరా ఉత్సవాలు చూసి తిరిగి ఇంటికి వెళుతుండగా వేగంగా వచ్చిన మోటార్‌బైక్ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం బంధువులు నెల్లూరు డీఎస్ఆర్ ఆస్పత్రికి తరలించారు.

- ఆదివారం ఉదయం బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద ఆటోను మోటార్‌బైక్ ఢీకొన్న ప్రమాదంలో కొలనకుదురుకు చెందిన డ్రైవర్ పిగిలం మస్తానయ్యకు గాయాలయ్యాయి. అతడిని చికిత్స కోసం గూడూరుకు తరలించారు. ఈ ప్రమాదాలపై పోలీస్ కేసులు నమోదు కాలేదు.
- మనుబోలు మండల కేంద్రంలో కొందరు ఆకతాయిలు నిత్యం వేగంగా మోటార్‌బైక్‌లు నడుపుతూ గ్రామస్తులను భయాందోళనకు గురిచేస్తున్నారు. ఈ విషయంపై పోలీసుల నుంచి స్పందన ఉండటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


బకాయిలు చెల్లించాలని డిమాండ్



మాట్లాడుతున్న చేనేత సంఘం నాయకులు

పొదలకూరు: చేనేత కార్మికులకు బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. చేనేత అధ్యయన యాత్రలో భాగంగా వారు ఆదివారం మండలంలోని తాటిపర్తి గ్రామానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్లుగా రూ.127.85 కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందన్నారు. బకాయిలను చెల్లించి అండగా నిలవాలని కోరారు. వచ్చే బడ్జెట్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.2 వేల కోట్లను చేనేతల కోసం కేటాయించాల్సిందిగా వెల్లడించారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, ఉపాధ్యక్షుడు పముజుల హరి, నాయకులు ఆకురాతి లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాదేవి గ్రామోత్సవాలు



కాళికామాత గ్రామోత్సవం



కోదండరామపురంలో అమ్మవారి ఊరేగింపు

మనుబోలు: మండలంలో దసరా ముగింపు ఉత్సవాలను శనివారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. అర్చకుడు సుబ్రహ్మణ్యం శర్మ మనుబోలులో, సాయిశర్మ కోదండరామపురంలో దసరా చావిళ్ల వద్ద అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అనంతరం కాళికాదేవి రూపంలో అలంకరించిన అమ్మవారిని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసి దేవతామూర్తుల ప్రతిమలు, ఆర్చిలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాల వెంట ఏర్పాటు చేసిన కోలాటం, తీన్‌మార్ బ్యాండ్, తప్పెట్లు, మంగళవాయిద్యాలు, వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి. యువకులు బాణాసంచా పేలుస్తూ ఉత్సవాల వెంట సందడి చేశారు. అర్ధరాత్రి ప్రారంభమైన ఉత్సవం మంగళవారం ఉదయం 10 గంటల వరకూ కొనసాగింది. ఉత్సవ కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

హిందూ మత సంరక్షణకు కృషి



మాట్లాడుతున్న మోవిడి శ్రీనివాసులు

కొడవలూరు: హిందూ మత సంరక్షణకు ఆర్ఎస్ఎస్ ఎంతగానో కృషి చేస్తోందని ఆ సంఘ నేత మోవిడి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని నార్తురాజుపాళెం త్యాగరాజ సంగీత నృత్య కళాశాలలో ఆ సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ మత గౌరవానికి భంగం కలుగకుండా ఎర్ఎస్ఎస్ ఎంతగానో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘ నేతలు సుధీర్‌స్వామి, సాయిబాబ, డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, శిరం మల్లికార్జున, శేషగిరిరావు, పేట మధు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి బాపిరాజు



బాపిరాజు చిత్రపటానికి నివాళులర్పించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: చిత్రకారుడిగా, నవలా రచయితగా, కవిగా విభిన్న పాత్రలు పోషించిన బహుముఖ ప్రజ్ఞాశాలి అడివి బాపిరాజు అని గ్రంథాలయాధికారి అల్లాడి నరసింహారావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని గ్రంథాలయంలో బాపిరాజు జయంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయాధికారి మాట్లాడుతూ సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా వంటి స్వాతంత్ర్య ఉద్యమాల్లో బాపిరాజు క్రియాశీలకంగా వ్యవహరించారని తెలిపారు. నవ్య సాహిత్య పరిషత్‌ను ఏర్పాటు చేసి ఎందరో చిత్రకారులకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ఆకాశవాణి రేడియో కేంద్రంలో సలహాదారుడిగా, సంపాదకుడిగా సేవలందించారని గుర్తుచేశారు. తన చిత్రాలతో సమాజాన్ని జాగృతం చేశారని కొనియాడారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకొని భవిష్యత్ ప్రణాళికలు నిర్మించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గండికోట సుధీర్‌కుమార్, సురేంద్ర, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.